
ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం



పిఎం ఇంటర్న్ షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పిఎం ఇంటర్న్ షిప్ పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇంటర్న్ షిప్ అనంతరం ప్రతిష్టాత్మకమైన కంపెనీలలో ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21లోగా https://pminternship.mca.gov.in/login లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ , బీటెక్ తదితర అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96769 65949, 99888 53335 నెంబర్లను ఫోన్ చేసి సంప్రదించవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

తెగ తాగేశారు..

ఉమ్మడి జిల్లాలో రూ.41.78కోట్ల మద్యం సేల్

విజయనగరం జిల్లాలో రూ.31.86కోట్లు

మన్యం జిల్లాలో రూ.9.91కోట్లు

మద్యం మత్తులో యువత

వ్యాపారులకు కాసుల పంట



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంక్రాంతి పండగ ఐదు రోజులూ మద్యం తెగతాగేశారు. ఎపి బేవరేజస్ ద్వారా ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని మద్యం దుకాణదారులు మొత్తంగా రూ.41.78కోట్ల మద్యాన్ని కొనుగోలు చేశారు. దీనికితోడు అప్పటికే దుకాణాల్లోవు ఓల్డ్ స్టాక్ సహా హాట్ కేకులా సేల్ అయిపోయిందట. ముఖ్యంగా యువత భోగిరోజు నుంచే మద్యం మత్తులో మునిగిపోయింది. సంక్రాంతి పండగ అంటే ఒకప్పుడు పిండి వంటకాలు, కొత్తబట్టలు, ఎడ్ల బండిపోటీలు, చిన్నపెద్ద అనే తేడా లేకుండా రకరకాల ఆటల హడావుడి కనిపించేది. ఇంకా చెప్పాలంటే చిన్ననాటి తీపిగుర్తులు చర్చించుకోవడం, బావ మరదుల సరసాలు వినిపించేవి. మారిన పరిస్థితులు వీటి నుంచి క్రమంగా దూరం చేసి, పండగ అంటే పేకాట, మద్యం మత్తే అన్నట్టుగా మారిపోయింది. ఈ ఏడాది జరిగిన మద్యం క్రయ, విక్రయాలే ఇందుకు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. అసలే తలసరి ఆదాయంలో అట్టడుగు స్థానం ఉన్న జిల్లా. వలస కూలీ కుటుంబాలే ఎక్కువ. అయినప్పటికీ భోగి రోజు నుంచి ముక్కనుమ వరకు వరసగా ఐదే ఐదు రోజుల్లో రూ.41కోట్ల 78లక్షల 65వేల 967 విలువగల మద్యాన్ని తాగేశారు. విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో మెజార్టీ గ్రామాల్లో బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. వీటి ద్వారా విజయనగరం జిల్లా రూ.31కోట్ల 86లక్షల 77వేల 738, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.9కోట్ల 91లక్షల, 88వే 229 చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. ఇరు జిల్లాల్లోనూ సేల్ అయిన మద్యంలో కనుమ, ముక్కనుమ రోజుల్లోనే అత్యధికంగా ఉంది. విజయనగరం జిల్లాలో 15, 16తేదీల్లో సుమారు రూ.14.75కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.4.43కోట్లు విలువైన మద్యం సేల్ అయ్యింది. ఇంటింటా మద్యం ప్రియులు ఉండడం, ముఖ్యంగా యువత ఇంటిపట్టున ఉండకుండా బయట గడపడం వల్ల గ్రామాల్లో కళ తప్పింది. ఇటువంటి సంస్కృతి పెచ్చుమీరడంతో నాటి సంప్రదాయాలు కనుమరుగతున్నాయంటూ పెద్దల్లో ఆవేదన వ్యక్తమౌతోంది. మరోవైపు మద్యం వ్యాపారులకు కాసుల పంట పండింది. మునుపెన్నడూ లేనంతగా మద్యం విక్రయాలు సాగడంతో లాభాలు కూడా అదే స్థాయిలో వచ్చివుంటాయని పలువురు భావిస్తున్నారు.

ధాన్యం.. దళారుల భోజ్యం

ప్రజాశక్తి - పాలకొండ

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు నచ్చిన మిల్లుకు ధాన్యం మిచ్చారు. అలాగే 24 గంటల్లో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. సకాలంలో డబ్బులు పడవని దళారులు రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేసి ధాన్యం కొనుగోలు చేశారు. దీంతో రైతులు నష్టపోయారు.

మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో రైతుల పండించిన ధాన్యం తడిసి ముద్దయింది. రంగుమారిన ధాన్యం ఎవరు కొంటారని ఆందోళన చెందిన రైతులు దళారును ఆశ్రయించారు. మండలంలోని బాసూరు, పిపి రాజుపేట, తుమ్మరాడ, కోటిపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం తక్కువ ధరకే రైతులు విక్రయించారు. 80 కేజీల ధాన్యం బస్తా రూ.1840కు మద్దతు ధర ఉండగా దళారుల మధ్యలో ఉండి 82 కేజీలు బస్తా రూ.1600కు రైతుల దగ్గర కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు అధికారులు అవగాహన కల్పించలేకపోయారు. దీంతో ఈ పరిస్థితి ఎదురైందని చెప్పవచ్చు. దీన్ని ఆసరాగా తీసుకొని ఇతర జిల్లా వ్యాపారాలు కూడా పండగ ముందు పలు గ్రామాల్లో ధాన్యం తక్కువ ధరకే కొనుగోలు చేశారు. పండగ గొట్టెక్కాలన్న ఉద్దేశంతో రైతులు 82 కేజీల బస్తాను రూ.1550కే ఇచ్చారు. వెంటనే డబ్బులు చెల్లిస్తారన్న ఉద్దేశంతో రైతులు నష్టానికి ధాన్యం విక్రయించారు. ఏదేమైనా రైతులకు ఏడాది కూడా ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తప్పలేదని చెప్పవచ్చు.



ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు

బాబసూరులో అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం

పండగ ముందు డబ్బులు కోసం దళారీలను ఆశ్రయించాం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి ధాన్యం విక్రయిస్తే ఎప్పటికో డబ్బులు వస్తాయని తెలియక పండగ ముందు డబ్బులు అందుతాయని ఆశతో ఇతర జిల్లా వ్యాపారులకు ధాన్యం విక్రయించాం. 82 కేజీల బస్తా రూ.1530కు ఇవ్వడం జరిగింది. అప్పులు చేసి సాగు చేసుకున్న తమకు గిట్టుబాటు ధర వస్తుందో లేదో తెలియక ఆందోళనతో విక్రయించాం.

ఎస్.దాలినాయుడు, రైతులు,

మిల్లర్లు ఇబ్బంది పెడతారని...

ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయాయి. రంగు మారిన ధాన్యం మిల్లర్లు తీసుకుంటారా లేక ఇబ్బందులు పెడతారా అన్న భయంతో దళారీలను ఆశ్రయించాం. వారు ఇదే అదునుగా తీసుకొని తక్కువ ధరకే విక్రయించారు.

ఎం.వైకుంఠం, రైతు, పాలకొండ.

12వ రోజు 373 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్ష ప్రక్రియ సజావుగా సాగుతోంది. జిల్లా పోలీసు గ్రౌండ్‌లో 12వ రోజు శుక్రవారం నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 475 అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 373మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్, అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



ప్రజాశక్తి - పాచిపెంట

పాచిపెంటలోని సాలాపు వీధికి చెందిన సుంకర నీలిమ (32) గురువారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై వెంకట సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలాపు వీధికి చెందిన నీలిమకు భర్త సుంకర వెంకట్రావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో నీలిమ భర్తను విడిచి తన బంధువుల ఇంటికి రాయగడ వెళ్లిపోయింది. నెల రోజుల క్రితం పెద్దల సమక్షంలో నీలిమ తన భర్త వెంకటరావు వద్దకు వచ్చి పిల్లలతో కలిసి జీవిస్తోంది. గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో వారు నివాసం ఉంటున్న ఇంట్లో ఒక గదిలో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ మేరకు నీలిమ తల్లి పార్వతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 18న కడప జిల్లా మైదుకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారనిచెప్పారు. జిల్లా నుండి గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అంకిత భావంతో భాగస్వామ్యులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని, వాటికి అనుగుణంగా కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు తగిన శ్రద్ధ చూపాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో సామాజిక భాగస్వామ్యాన్ని (కమ్యూనిటీ ఎంగేజ్ మెంట్) ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిసున్నట్లు ఆయన వివరించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలని కోరారు. పంచాయితీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక - పట్టణాభివద్ది శాఖలు కీలక భూమిక పోషించాల్సి ఉందని, అందుకు తగిన విధంగా ఆయా శాఖల అధికారులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని, ప్రజల భాగస్వామ్యంతో మానవ హారాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి అంశాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహణ చేసిన అనంతరం, అపారిశుధ్య ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. చెత్త కుప్పల తొలగింపు, తాగు నీటి వసతుల క్లోరినేషన్, మురుగు కాలువలు శుభ్రం, చెరువుల వద్ద చెత్త లేకుండా చూడడం, సామాజిక మరుగుదొడ్లను గుర్తించడం - ఉపయోగంలోకి తీసుకురావడం, ఇంటింటా తడిచెత్త - పొడిచెత్త ప్రక్రియ కొనసాగించడం, కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలను చేపట్టాలని ఆదేశించారు. దోమలు నివారణకు ఆయిల్ బాల్ వినియోగించడం, మురుగునీరు నిల్వ లేకుండా చూడడంపై దృష్టి సారించాల్సిని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీలు బహిరంగ మలవిసర్జన రహిత పంచాయతీలుగా మారాలని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఒ టి.కొండలరావు, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి బి.రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నెలకొక అంశంతో

ఈ నెల 18 నుంచి వచ్చే 12 నెలల పాటు నెలకు ఒక థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా జనవరిలో న్యూ ఇయర్ -క్లీన్ స్టార్, ఫిబ్రవరిలో సోర్సు - రిసోర్సు, మార్చిలో అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ - ప్రమోట్ రీయూజబుల్స్, ఏప్రిల్‌లో ఇ-చెక్, మే లో నీరు-మీరు, జూన్ లో బీట్ ది హీట్, జులైలో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్, ఆగస్టులో మాన్ సూన్ హైజినిక్, సెప్టెంబరులో గ్రీన్ ఎపి, అక్టోబరులో క్లీన్ ఎయిర్, నవంబరులో పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్, డిశంబరులో "ఆపర్చునిటీస్ ఇన్ ఎన్విరాన్మెంట్" అంశాలతో థీమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మృత్యుద్వారాలు... రహదారులు

- ప్రమాదాలతో రక్తమోడుతున్న రోడ్లు
- గాలిల్లో కలిసిపోతున్న ప్రాణాలు



కారును ఢీకొన్న లారీ (ఫైల్)

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రహదారుల ప్రమాణాలకు మించి ప్రయాణిస్తున్న భారీ వాహనాలు, రహదారి నిబంధనలకు వ్యతిరేకంగా క్రమశిక్షణ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారుల అతివేగం, పెరిగిన రద్దీ కారణంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని రహదారులు మృత్యుద్వారాలుగా మారి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీనివల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలు అనాథులుగా మారి రోడ్డున పడుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాగుండా వెళ్తున్న చిలకపాలెం - పార్వతీపురం, కళింగపట్నం -కూనేరు రాష్ట్ర రహదారులపై గత రెండు రోజుల వ్యవధిలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడమే ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. కేవలం 20 టన్నుల వాహనాలకు మాత్రమే అనుగుణంగా నిర్మించిన రాష్ట్ర రహదారులపై ప్రస్తుతం 80 టన్నుల సామర్థ్యం గల భారీ వాహనాలు విశాఖపట్నం నుండి రాయపూర్ వరకు వెళ్తున్నాయి. వీటిపై గల పారాది, సీతానగరం వంతెనలు శిథిలం కావడంతో వీటిని వీరఘట్టం, పాలకొండ మీదుగా విశాఖపట్నానికి మళ్లిస్తున్నారు. పరిమితికి మించి భారీ వాహనాలు ప్రయాణించడం, అసలే ఇరుగ్గా ఉన్న రహదారులు గుంతలుగా మారి కార్లు, బైకులపై ప్రయాణిస్తున్న వారి పట్ల కర్కసంగా మారి వారి ప్రాణాలను తీస్తున్నాయి. చాలా కాలంగా ఈ రెండు రహదారులను జాతీయ రహదారులుగా ప్రభుత్వం మార్చుతుందనిఅధికారులు ప్రకటించడమే తప్ప స్పష్టమైన కార్యాచరణ ఏదీ లేదు. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పి4 విధానంలో రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించి ప్రయాణికులను కూడా వీటి నిర్మాణాల్లో భాగస్తులను చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే సీతానగరం, పారాది, మానాపురం వంతెనలు నిర్మాణం కాకపోవడంతో విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణీకులు నిత్యం నరకం చూస్తున్నారు. అలాగే పార్వతీపురం బైపాస్ రోడ్డు గుండా పాలకొండ వైపు వెళ్లే మార్గం కూడా ఇరుగ్గా మారడంతో నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వాహనదారుల అతివేగం, భద్రత ప్రమాణాలు పాటించని వాహనాలు, వాహనదారులు, ఇరుగ్గా మారిన రోడ్లపై భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట రహదారి ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితి గమనించిన అధికారులు, పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రహదారులను విస్తరించి, నాణ్యతా ప్రమాణాలతో కూడిన రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.



విగ్రహ పున: ప్రతిష్ట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు

5 నుంచి వెంకటేశ్వర స్వామి విగ్రహ పున: ప్రతిష్ట

ప్రజాశక్తి - పార్వతీపురం

గరుగుబిల్లి మండలం తోటపల్లిలో గల వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ పున: ప్రతిష్ట కార్యక్రమం ఫిబ్రవరి 5 నుండి 8 వరకు నిర్వహించేందుకు ఆలయ కార్య నిర్వహణ అధికారి, తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ నిర్ణయించాయి. దేవాదాయ శాఖ సౌజన్యంతో తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ఆలయ అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత పోస్టర్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సభ్యులు కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. ఫిబ్రవరి 5 నుండి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో ప్రతిష్ట కార్యక్రమాలు, 8న వార్షిక కళ్యాణోత్సవంలో జరుగుతుందని వారు వివరించారు. 7న యంత్ర ప్రతిష్ట మరియు కుంభాభిషేక మహొూత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు గానూ గరుగుబిల్లి మండలం గిజబ గ్రామానికి చెందిన ప్రసాద్ లక్ష రూపాయలు చెక్కును విరాళంగా కలెక్టర్ చేతులు మీదుగా ట్రస్ట్ కోశాధికారి తామడ దుర్గారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ డి.పారి నాయుడు, ట్రస్ట్ కన్వీనర్ శ్రీరామచంద్ర మూర్తి, కో మేనేజింగ్ ట్రస్టీ చుక్క భాస్కర రావు, ట్రస్టీలు గొట్టాపు తవిటి నాయుడు, సత్యం మాస్టర్, వడ్డీ మహేష్, హరి, టి శివ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

టెస్ట్ పేపర్లను వినియోగించుకోండి : డిఇఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

యుటిఎఫ్ తయారు చేసిన ఎస్సెస్సీ మోడల్ టెస్ట్ పేపర్లను ఈ ఏడాది మార్చిలో పబ్లిక్ పరీక్షలు రాయబోయే పదో తరగతి విద్యార్థులంతా వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ తయారు చేసిన ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్లను పార్వతీపురం, పాలకొండ ఉప విద్యాశాఖాధికారులతో కలిపి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యుటిఎఫ్ పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఈ నమూనా పరీక్ష పత్రాలు రూపొందిస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఏటా అన్ని సబ్జెక్టుల్లో 60 నుంచి 85 శాతం వరకు ఈ మోడల్ పేపర్ల నుంచి పబ్లిక్ పరీక్షల్లో వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారులు పి.కృష్ణమూర్తి, రాజకుమార్, సాంఘిక సంక్షేమ డిడి గయాజుద్దీన్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రామకృష్ణ, జియ్యమ్మవలస మండల యుటిఎఫ్ నాయకులు పి.మురళీకృష్ణ, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పి.రామకృష్ణ, జిల్లా లోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఇఒ తిరుపతినాయుడు, డిప్యూటీ డిఇఒలు, యుటిఎఫ్ నాయకులు

జన్‌మాన్ పనుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జన్ మాన్ పనుల తాజా వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జన్‌మాన్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు జలజీవన్ మిషన్ కింద నీటిని సరఫరా చేసేందుకు అవసరమగు అన్ని చర్యలు చేపట్టాలని, వాటిని సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పనుల వివరాల నమోదులో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, డేటాలో వచ్చే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమించాలని అన్నారు. వైద్య, ఆరోగ్య సేవలు పక్కాగా అందాలన్నారు. పివిటిజి గ్రామాల్లో అన్ని రంగాల్లో శతశాతం అభివృద్ధికి అన్ని శాఖలు కృషి చేయాలని ఆయన అన్నారు. సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కర రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిడి కష్ణవేణి, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అడలి పర్యాటక కేంద్రానికి మరిన్ని సౌకర్యాలు : డివిజి

ప్రజాశక్తి - పాలకొండ


సీతంపేట మండలం అడలి పర్యాటక కేంద్రానికి మరెన్నో సౌకర్యాలు కల్పించాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు అన్నారు. అడలి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం పరామర్శించారు. టూరిజం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అయితే అక్కడ కూర్చుని వారికి సౌకర్యాలు సమకూర్చేలా చూడాలని అన్నారు. పర్యాటకులు సురక్షితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ టూరిజం ద్వారా గిరిజనులు కూడా లబ్ధిపొందేలా చూడాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

క్షతగాత్రులను పరామర్శ

ఆసుపత్రిలో రోగులు పొందుతున్న సేవలపై సంతృప్తి చెందారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు పనితీరును కొనియాడారు. ఆస్పత్రిలోని సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. శంకరరావు వెంట మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు



సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సంపద తయారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని బెజ్జి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా తడి, పొడి చెత్త వేరు చేసి, ఎరువుగా మార్చి రైతులకు విక్రయించవచ్చన్నారు. దీనివల్ల పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మల భాను, వైస్ ఎంపిపి వాకముని అనిల్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, ఎంపిడిఒ విజయరంగారావు తదితరులు ఉన్నారు.



నిమ్మగడ్డి విత్తనాలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

నిమ్మగడ్డి సాగుపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన రైతులకు నిమ్మగడ్డి సాగుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ సిబ్బందిదేనని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయం వద్ద వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న పొలాల్లో నిమ్మగడ్డి సాగు, అలాగే కొండల్లో వెదురు సాగుపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీతో గిరిజన రైతులకు అందిస్తుందని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. అనంతరం రబీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలవలస కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి సీనియర్ నేత, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ మృతి విషయం తెలుసుకున్న ఎవిటి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు శుక్రవారం ఇక్కడికి వచ్చి పరామర్శించారు. రాజశేఖర్ కుమారుడు ఎమ్మెల్సీపాలవలస విక్రాంత్, ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి పరామర్శించారు. రాజశేఖర్ లేనిలోటు పార్టీకి తీరనిదని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్షతగాత్రులను ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పాలకొండ

అడలి నుంచి వస్తుండగా ప్రమాదంలో గాయపడి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవలందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావును సూచించారు. గత ప్రభుత్వం తప్పిదం వల్ల ఈ పరిస్థితి లేదన్నారు. గతంలో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పనులన్నీ సగం లోనే నిలిపివేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యూ పాయింట్ దగ్గర రక్షణ గోడ నిర్మిస్తామన్నారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పల నాయుడు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గర్భాన సత్తిబాబు ఉన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన యువత సైబర్ క్రైమ్ నేరాలు బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. మండలంలోని గుమ్మిడిగూడ, రంగపురం, షేకుపాడు, దండుసుర గిరిజన గ్రామాల్లో యువతకు సైబర్ క్రైమ్ నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, కొత్త నెంబర్లతో ఫోన్లు చేస్తుంటారని, అటువంటి వాటికి నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ శశికుమార్

అధిక లోడ్ వాహనాల్లో ప్రయాణాలు వద్దు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అధిక లోడ్ వాహనాల్లో ప్రయాణాలు వద్దని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్ విజ్ఞప్తి చేశారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సంక్రాంతికి సొంత ఊర్లకు వెళ్ళిన ప్రజలు తిరుగు ప్రయాణంలో ఉన్నందున శుక్రవారం పార్వతీపురం రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గమ్య స్థానాలను తొందరగా చేరుకోవాలనే ఉద్దేశంతో అధిక ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు, మ్యాక్సీ క్యాబ్ లు, ఇతర వాహనాలలో ప్రయాణించరాదని కోరారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపరాదని ఆయన అన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది తో ద్విచక్ర వాహనం నడపరాదన్నారు. కుటుంబ భద్రత గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. రహదారి సురక్షిత నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. ప్రతి క్షణం జాగరూకతతో ఉండాలని, ప్రాణాలు అమూల్యమన్నారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పి గ్యాస్ గోల్డెన్ జూబ్లీ బంపర్ డ్రా విజేతలు వీరే

ప్రజాశక్తి - భామిని

భామినిలో గల శ్రీమన్నారాయణ హెచ్ పి గ్యాస్ కార్యాలయం లో మాజీ ఎంపిటిసి బిద్దికి ప్రసాద్ ఆధ్వర్యంలో హెచ్‌పి గ్యాస్ గోల్డెన్ జూబ్లీ బంపర్ డ్రా శుక్రవారం నిర్వహించారు. ఈ బంపర్ డ్రా బొడ్డగూడకు చెందిన బిద్దికి సాయమ్మ మొదటి విజేతగా, పసుకుడి గ్రామానికి చెందిన ఆనందరావు రెండవ విజేతగా, భామినికి చెందిన గౌడు తిరుపతిరావు మూడవ విజేతగా నిలిచినట్లు గ్యాస్ నిర్వాహకులు కొరాడ రాజేష్ తెలిపారు. వీరికి బహుమతులు అందజేస్తామన్నారు.

17మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలోని గుమడాంలో ఈనెల 15న శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన 17మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టౌన్ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. గుమడాంలోని నాయుడు వీధి,గొల్లి వీధులకు చెందిన కొంతమంది యువకులు గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు భంగం కలిగించారని చెప్పారు. వీరిని శుక్రవారం మండల మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు సిఐ ఒక ప్రకటనలో తెలిపారు.

శిథిల భవనాల్లో విధులు

భయాందోళనలో ఉద్యోగులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మేడి పండు చూడు మేలిమై ఉండు పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్న చందంగా ఉంది మండలంలోని ప్రభుత్వ భవనాల పరిస్థితి. కాలం చెల్లక ముందే భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఉద్యోగులు భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు.

మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంతో పాటు వ్యవసాయ కార్యాలయం, ఎంఆర్‌సి, ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయం మార్కెట్‌యార్డ్‌లో గల ఓ భాగంలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అలాగే ఎంఆర్‌సి భవనం పూర్తిగా శిథిలమవ్వడంతో పక్కనే అదనంగా వేరే భవనం నిర్మించినప్పటికీ అది ఇరుగ్గా ఉండడంతో ఉపాధ్యాయులు సమావేశాలు పెట్టుకునేందుకు అవకాశం లేదు. దీంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావవస్థకు చేరుకోవడంతో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న బాలికల వసతి గృహంలోకి ఆ కార్యాలయాన్ని తరలించారు. అప్పట్లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడలు బీటలు వారి స్లాబ్ పూర్తిగా పెచ్చులూడి దర్శనం ఇవ్వడంతో అందులో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల సమావేశాలు పెట్టుకునేందుకు అవకాశం లేదు. దీంతో పక్కనే ఉన్న ఎపి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో సమావేశాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వైద్య, ఆరోగ్య ఉద్యోగులు వాపోతున్నారు.



నడుకూరులో శిథిలావస్థలో గల గ్రామపంచాయతీ కార్యాలయం



శిథిలమైన తూడి పశు వైద్య కేంద్రం

మండలంలోని తూడి పశువైద్య కేంద్రంతో పాటు నడుకూరులోని పంచాయతీ కార్యాలయం పూర్తిగా శిథిలమవ్వడంతో చిన్నపాటి వర్షం పడ్డా వరద నీరంతా శ్లాబ్ పైనుంచి కిందకు జారిపోవడంతో పాటు గదులు నీటితో నిండిపోతున్నట్లు ఆయా శాఖల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇరుకైన గదులు కావడంతో మరోవైపు శ్లాబ్ పెచ్చులు అక్కడక్కడ ఊడిపడడంతో ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ పనులు చేపట్టినప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు గుత్తేదారులు ఇచ్చిన కాసులకు కక్కుర్తిపడడంతో మూడు కాలాల పాటు ఉండాల్సిన భవనాలు ముక్కలు, చెక్కలుగా దర్శనిస్తున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తిస్థాయి పరిశీలన జరిపి శిథిల భవనాలు తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులు కోరుతున్నారు.

పరాయి పంచన సచివాలయం

నేటికీ పూర్తికాని భవనాలు
ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన అయిన సచివాలయాల భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. కొన్నిచోట్ల భవనాలు శ్లాబ్ లెవెల్‌లో పూర్తయి ప్లాస్టింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా, మరి కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. మరికొన్నిచోట్ల పెయింటింగ్, విద్యుత్తు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. మండ సచివాలయం పనులు పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని 27 పంచాయతీలు ఉండగా, 24 పంచాయతీలకు గ్రామ సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాలు ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ వీటికి సొంతగూడు లేకపోవడంతో పరాయి పంచన విధులు నిర్వహిస్తున్నారు. గోయిపాక సచివాలయం, రైతు భరోసా కేంద్రం విధులను ఓ ఇంటి వద్ద నిర్వహిస్తున్నారు. ఇరుకైన ఇంట్లో, సరైన వెలుతురు లేని గదిలో విధులు నిర్వహించడంతో సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, పి.ఆమిటి, మండ,



గోయిపాకలో ఇంటి వద్ద నిర్వహిస్తున్న సచివాలయం



ఎల్విన్ పేట లో నిలిచిన సచివాలయం భవన నిర్మాణ పనులు

దుడ్డుఖల్లు, ఇరిడి, తాడికొండ, చెముడు గూడ,కుక్కిడి, కొండ వాడ, లంబేసు, బీరుపాడు, నెల్లి కేక్కువ, రెల్ల, బాలేసు, తదితర పంచాయతీల్లో సచివాలయ భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. మండ సచివాలయం భవనం పూర్తయి ఏడాదైనప్పటికీ నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇరుకైన గదుల్లో సిబ్బంది కూర్చోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామసభలు, సమావేశాలు ఆరు బయట నిర్వహించాల్సి వస్తోంది. ప్రభుత్వం సచివాలయాలపై దృష్టి సారించి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



దుమ్మంగిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

చెరువులో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మహిళా సాధికారిత, ఆర్థిక భద్రత ఆరోగ్య భద్రత, స్వయం ఉపాధి కల్పన కోసం పంపిణీ చేసిన చేప పిల్లలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని దుమ్మంగి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో శుక్రవారం 25వేల చేప పిల్లలు ఆమె విడుదల చేశారు. ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు, గిరిజన ఉపప్రణాళిక పథకం (ఎస్‌సిఎ టు టిఎస్‌ఎస్ పథకం)లో 100 శాతం సబ్సిడీతో కురుపాం నియోజక వర్గం పరిధిలో గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో 151 ట్యాంక్‌ల్లో 7,12,000 ఫిగర్ లిస్ట్ కట్లా, రాగండి, ఎరుమైల జాతికి చెందిన చేప పిల్లల్ని ఉచితంగా పంపిణీ చేయడం వల్ల 428 మంది గిరిజన మత్స్య రైతులకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఫిష్ ఫార్మింగ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగి దగ్గర గల కిరండాల్ ట్యాంక్ నుంచి విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలక క్రాంతికుమార్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు భూషణ్, ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు పద్మావతి, సుధ, రామకృష్ణ, వెంకటరావు, రామారావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు, ట్రైబల్ ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షులు, విఎఫ్ఎ ఎస్.సురేష్, వెంగళ రాయుడు, ఇంద్రజ, స్థానిక సీడ్ ఫామ్ ఇన్చార్జ్ పాలకొండ మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డి.గోపికృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఈనెల 18న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ గర్భాన శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 11.30గంటల నుంచి 1.30 వరకు పరీక్ష ఉంటుందని, తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 సంవత్సరంలో చదువుకున్న 50మంది పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. చాలాకాలం తర్వాత ఒకచోటకు చేరి కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు ఒకర్ని ఒకరు పలకరించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం

ప్రజాశక్తి - పాచిపెంట

పంటలకు ఆశించే చీడ పీడల విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వ ఎన్‌పిఎస్‌ఎస్, రాష్ట్ర ప్రభుత్వ ఎపిఎస్‌ఎస్‌ను ఆవిష్కరించిందని, కావున రైతులు యాప్‌ను ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. పంటపై ఆశించిన చీడపీడ పురుగుల ఫోటోలను తీసి పంపించి రైతుల వివరాలను నమోదు చేసిన వెంటనే సంబంధిత ఫోన్‌కు తెగుళ్ల నివారణ చర్యలు మెసేజ్ రూపంలో కనిపిస్తున్నాయని తెలిపారు. మండలంలోని పెద్దచీపురువలస, క్రివలసల్లోని పంటలను పరిశీలించిన అనంతరం రైతుల మొబైల్ యాప్ ద్వారా తెలుసుకునే శిక్షణను ఇచ్చారు. వరి పంట నారుమడుల్లో అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు ఆశించి ఉన్నాయని ఫోటోలు తీసి పంపించిన వెంటనే అజాక్సిస్ట్రోబిన్ మందును పిచికారీ చేయాల్సిందిగా మెసేజ్ వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఉదయం పూట పొగ మంచు పడుతూ పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడాలు అధికంగా ఉండడం వల్ల వరి నారుమడుల్లో అగ్గి తెగులు ఆశించిందని, వీటి నివారణా చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అధిక నత్రజని వాడినట్లయితే ఆకుమచ్చ తెగులు ఆశిస్తుందని, కావున విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడొద్దని తెలిపారు. ఇనుము ధాతు లోపం వల్ల నారుమడులు తెల్లగా మారినట్లయితే వెంటనే నీరు పెట్టడం ద్వారా భూమిలో ఉన్న ఇనుము ధాతువును పంటకు అందించే రూపంలోనికి మార్చడం ద్వారా ఇనుము లోపాన్ని నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు వినోద్ కుమార్, మోహనకృష్ణ పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు



నాగురులో మిశ్రమ విత్తనాలను వేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ అన్నపూర్ణ

అపరాల సాగు... ఆదాయం బాగు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

అపరాల సాగుతో రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ ఆసోసియేట్ జి.అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని నాగూరులో బొత్స సింహాచలం, కేతిరెడ్డి చంద్రశేఖర్, పెద్దింటి సింహాచలం, అల్లు సింహాచలం పొలంలో శుక్రవారం పంట మార్పిడి విధానం ద్వారా వరి పంట తర్వాత అపరాలైన పెసలు ప్రధాన పంటతో పాటు కట్టే జనుమ, ఆముదాలు, జొన్నలు, గోంగూర, ముల్లంగి, బెండ మొదలగు విత్తనాల మిశ్రమం వేయించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగినప్పుడు, పురుగులు - తెగుళ్ల తట్టుకునే శక్తి కలిగి ఉండే పంటలు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను, అధిక పోషకాలు కలిగిన ఆహార ఉత్పత్తులైన పెసలు, మినుములు, ఉలవలు, శనగలు, మొదలగు పంటలతో ఇతర పంటల విత్తనాలు కలిపిన మిశ్రమం విత్తనాలను వేయడం వల్ల ఆదాయం బాగా రావడంతో పాటు, మొక్కల్లో జీవ వైవిధ్యం పెంపొందుతుందని తెలిపారు. భూమిని కూడా సారవంతమవుతుందన్నారు. ఏడాది పొడవునా పంటలు పండించడం వల్ల నిరంతర ఆదాయం, ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆహార భద్రత సాధించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, రైతుసేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే చిలకాంలో ఏగిరెడ్డి జగదీశ్, పి.శ్రీను పొలంలో వరి నారు పోసి, మళ్లీ దమ్ము చేసి ఊడుచుకోవడంతో పెట్టుబడులు పెరుగుతాయని, అలా కాకుండా వరి విత్తనాలను విత్తన శుద్ధి చేసి నేరుగా ఎద జల్లడం వల్ల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని అన్నపూర్ణ సూచించారు. కార్యక్రమంలో రైతులు, మండల ఇన్చార్జి వి.పోలినాయుడు, గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేపల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సంక్రాంతి పండగ దాటినా చేపల ధరలు తగ్గక పోవడం గమనార్హం. సంక్రాంతి పండగ నేపథ్యంలో బుధవారం కనుమ పండగ కావడంతో మాంసప్రియులు ఎగబడి మాంసాలు, చేపలు అత్యధిక ధరలకు కొనుగోలు చేశారు. మక్కనుమ గురువారం పడడంతో ఎవరూ మాంసాహారం వైపు ఆసక్తి చూపలేదు. శుక్రవారం మాత్రం మున్సిపల్ నెహ్రూ మార్కెట్ లోపల ఉన్న చేపల దుకాణాలకు అత్యధిక సంఖ్యలో చేపలు కోనేందుకు మార్కెట్‌కు తరలిరావడంతో చేపల అమ్మకం దారులు వాటి ధరలను పెంచి అమ్మసాగారు. చేసేదిలేక మాంసం ప్రియులు కేజీ చేపలను రూ.250 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చింది.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం కల్పించే అంశాలపై దృష్టిసారిస్తున్నట్లు కమిషనర్ ఎస్.సర్వేశ్వరావు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలో పలు వీధుల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, తాగునీటి ప్రజలకు అందే విధానాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ఇందిరానగర్ కాలనీలో తాగునీటి సరఫరాను పరిశీలించి నీరు ఎలా వస్తుందని మహిళలను అడిగి తెలుసుకున్నారు.అలాగే ఒడమ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ చెత్త సేకరణ ఎలా జరుగుతుందో పరిశీలించారు. మూడు చెత్తబిన్నుల విధానం అమలు చేసి ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజు క్రమం తప్పకుండా చెత్త సేకరించాలన్నారు.



ఇందిరానగర్‌కాలనీలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 -26లో గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులతో రుణాలకు సిద్ధం చేసుకుని గ్రామాల అభివృద్ధిపై చేపట్టాల్సిన పనులు చేయాలన్నారు. ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పనులకు మంజూరైన విధులతో పనులు చేపట్టి నివేదికలు ఇవ్వాలన్నారు. డ్రైనేజీ, సిసి రోడ్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ, ఎపిఒ పి.భాను, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

20 నుంచి పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -సీతానగరం

ఈనెల 20 నుంచి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్థక శాఖ ఎడి సిహెచ్ దీనకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు సందర్భంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు గర్భాశయానికి సంబంధించి వ్యాధులు కాకుండా అన్ని రకాల వ్యాధులకు శిబిరాలు ఏర్పాటు చేసి వాటికి వైద్యమందించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాలు ఈనెల 31 వరకు అన్ని గ్రామాల్లో జరుగుతాయన్నారు.



కురుపాంలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని స్థానిక ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో గల ప్రదీప్‌నగర్ కాలనీ ప్రధాన రహదారి వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనాదారులకు అపరాధ రుసుం వేసి, పెనాల్టీ బకాయిలు ఉన్న వాహనదారులకు వెంటనే కట్టించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరూ మద్యపానం సేవించకుండా రహదారి భద్రత నియమాలు పాటించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ భద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాల నివారణపై మండలంలోని కిట్టలపాడు జంక్షన్ వద్ద ఎస్సై వై.అమ్మనరావు అవగాహన కల్పించారు. ఆటోలో ప్రయాణికులకు పరిమితి మించి ఎక్కించరాదన్నారు. వాహనం ఫిట్నెస్‌గా ఉండాలన్నారు. మితిమీరి వేగం వెళ్లరాదని చెప్పారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే సంబంధించిన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టూ వీలర్‌తో బయటకు వస్తే హెల్మెంట్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ, పోలీసు సిబ్బంది ఉన్నారు.